క్లుప్తంగా

ఏయూ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఆచార్య విజయ మోహన్ తదితరులు

విశాఖ విద్య : ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే ఏయూ అథ్లెటిక్స్ పురుషులు, మహిళ ల జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు అథ్లెటిక్స్ జట్లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో ప్రతిభ సాధించి వర్సిటీ కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్‌వీ జయమోహన్ మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలు భువనేశ్వర్ కిట్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. ప్రతిభ సాధించిన క్రీడాకారులు యూనివర్సిటీ పురుషులు, మహిళల జట్టుకు 19 మంది ఎంపికయ్యారని తెలిపారు. జట్టు కోచ్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పీడీ ఎస్.అప్పా రావు, గణేష్ పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి



పెరియార్ రామస్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నగరవాసులు

ఏయూ క్యాంపస్ : ద్రావిడ ఉద్యమకారుడు పెరియార్ ఇ.వి.రామస్వామి 51వ వర్ధంతిని బీచ్‌రోడ్డులో మంగళవారం నిర్వహించారు. వైఎంసీఏ ఎదురుగా ఉన్న విగ్రహానికి నగరవాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత నాస్తిక సమాజం నాయకులు జె.రవి మాట్లాడుతూ పెరియార్ ఆలోచనలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. అణగారిన వర్గాలు అగ్రవర్ణాలతో కలిసి సమాజంలో జీవించే హక్కు, అవకాశం కల్పించాలని పెరియార్ పోరాడారన్నారు. కార్యక్రమంలో వై.నూకరాజు, రామ్ ప్రభు, శ్రీనివాసరావు, జె.సునీత, రవి సిద్ధార్థ, సీహెచ్ మధుబాబు, ఇసుకపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో సందడి



కురుసుర వద్ద బారులు తీరిన పర్యాటకులు

ఏయూ క్యాంపస్ : పర్యాటక ప్రాంతాల్లో సందడి నెలకొంది. క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో విశాఖకు పర్యాటకులు భారీగా పెరిగారు. బీచ్‌రోడ్డులోని పర్యాటక స్థలాలను సందర్శించడానికి వీరంతా ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి భారీగా పర్యాటకులు వస్తున్నారు. మంగళవారం కురుసుర మ్యూజియం వద్ద భారీగా సందర్శకులు క్యూలో వేచి ఉన్నారు. అదేవిధంగా టీయూ 142, విశాఖ మ్యూజియం తదితర ప్రాంతాలను సైతం వీరు సందర్శిస్తున్నారు. దీంతో బీచ్‌రోడ్డులో పొరుగు రాష్ట్రాల పర్యాటకుల సందడి పెరిగింది.

శ్యామ్ బెనగళ్ మృతికి సంతాపం

మద్దిలపాలెం : భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన శ్యామ్ బెనగళ్ (90) మృతికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సంతాపం వ్యక్తం చేసింది. నిజ జీవితంలోని సంఘటనలే ఇతివృత్తంగా అనేక చిత్రాలకు దర్శకత్వం వహించారని వక్తలు కొనియాడారు. దేశంలో ఫిల్మ్ సొసైటీల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. త్వరలో ఆయన చిత్రాలను ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కాశీ విశ్వేశ్వరరావు, నరవ ప్రకాశరావు పాల్గొన్నారు.



ఉయ్యాలలు లేక ఖాళీగా ఇనుప స్తంభాలు



విరిగిపోయిన ఆట వస్తువులు



మైదానంలో సేద తీరుతున్న కుక్కలు

అధ్వానంగా ఆటస్థలం



విరిగిపోయి ప్రమాదకరంగా జారుడుబల్ల

- దెబ్బతిన్న ఆట పరికరాలు
- స్మార్ట్ సిటీ వసతుల నిర్వహణ శూన్యం



నిర్వహణ లేక పాడైపోయిన ఆట వస్తువులు

ఏయూ క్యాంపస్ : చిన్నారులు ఆడుకునే ఆట స్థలం ఎంతో సురక్షితంగా ఉండాలి. వారికి ఆహ్లాదాన్ని పంచే ఈ ప్రదేశం పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండటం అవసరం. ఇందుకోసం జీవీఎంసీ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా పలు పాఠశాలల్లో ఆట స్థలాలు, క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి చేశారు. వీటిపై సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేక ప్రస్తుతం పూర్తిగా పాడైపోయాయి. చిన్నారులు ఆటలాడితే ఆరోగ్యం, ఆహ్లాదం వస్తుందో రాదో తెలియదు కానీ గాయాలపాలవడం మాత్రం ఖాయమనేలా పరిస్థితులు మారిపోయాయి. చినవాల్తేరు 21వ వార్డు పరిధిలోని ప్రధాన రహదారిపై ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా స్థలం ప్రస్తుత పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపుతున్నాయి ఈ చిత్రాలు. పేరుకే ఆట స్థలం తప్ప... ఇక్కడ పిల్లలు ఆటలాడుకోవడానికి అనువైన పరిస్థితులు మాత్రం కరువయ్యాయి. ప్రధానంగా చిన్నారులకు దెబ్బలు తగలకుండా ఆట స్థలంలో ప్రత్యేకమైన ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం దెబ్బతిని ఎక్కడికక్కడ పెచ్చులూడిపోయి సిమెంట్ ఫ్లోరింగ్ బయటకు కనిపిస్తోంది. వీటిపై ఆటలాడుతూ పిల్లలు కింద పడితే గాయాలపాలయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేపట్టడం, కొత్త ఫ్లోరింగ్ వేయడం ఎంతో అవసరం.

ఖాళీ ఇనుప స్తంభాలు

ఉయ్యాలలు పూర్తిగా పాడైపోవడంతో ప్రస్తుతం ఇక్కడి నుంచి తొలగించారు. దీంతో ఖాళీ ఇనుప స్తంభాలు మాత్రమే విద్యార్థులకు దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా జారుడు బల్ల ఎక్కే మెట్లు విరిగిపోయాయి. జారుడుబల్ల జారే కింది భాగంలో పూర్తిగా ప్లాస్టిక్ విరిగిపోయి పెద్ద రంధ్రం ఏర్పడింది. ఇది ఎంతో ప్రమాదకరంగా మారింది. అదేవిధంగా ఇతర ఆట వస్తువులు సైతం దాదాపుగా పాడైపోయాయి. చిన్నారులకు ఉపయోగం లేకపోగా ఆడితే ప్రమాదానికి గురయ్యేలా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పాత వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తేనే చిన్నారులకు పూర్తి స్థాయిలో ఆట వస్తువులు ఉపయుక్తంగా నిలిచే అవకాశం ఉంది. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ మైదానంలో బయటి వ్యక్తులు వచ్చి ఆడుకుంటున్నారు. ఉదయం వేళల్లో పలు శునకాలు మైదానంలో సేద తీరుతున్నాయి. వీటిని చూసి చిన్నారులు అటు వైపు వెళ్లడానికి సాహసించడం లేదు. ప్రస్తుతం ఈ పాఠశలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 124 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ఉపయుక్తంగా క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.



దెబ్బతిన్న ఫ్లోరింగ్

ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసుల కొరడా



విశాలాక్షినగర్‌లో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బడ్డీ తొలగించాలని ఆదేశిస్తున్న సీఐ ప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. కైలాసగిరి, జోడుగుళ్లపాలెం బీచ్, తెన్నేటి పార్కు తదితర పర్యాటక కేంద్రాలకు ప్రధాన రహదారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత ఏడాది జీవీఎంసీ విస్తరించింది. ఇందుకోసం హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్‌లో కైలాసగిరి కూడలి వరకు రూ.కోట్లు ఖర్చు చేసింది. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పాదచారుల సౌలభ్యం కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించింది. ఈ ఫుట్‌పాత్‌లను ఇటీవల కొందరు టీడీపీ స్థానిక నాయకులు ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చేశారు. ఈ వ్యవహారంపై 'కప్పం కట్టుకో.. ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకో..' శీర్షికతో సాక్షిలో మంగళవారం ప్రచురించిన కథనానికి ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్, స్థానిక సచివాలయ టౌన్‌ప్లానింగ్ సెక్రటరీ రాజ్‌నాయక్‌తో కలిసి ఫుట్‌పాత్‌లను పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించారు. పకోడీ బడ్డీలు, టిఫిన్ సెంటర్లు, బుక్స్, స్టేషనరీ షాపులు, హోటళ్ల నిర్వాహకులను కలిసి ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. కొన్నింటిని సిబ్బందిచే నేరుగా తొలగించారు. ఇంకొన్నింటిని క్రేన్‌లు తీసుకొచ్చి తొలగిస్తామని సీఐ ప్రసాద్ తెలిపారు.



విశాలాక్షినగర్ కూడలి వద్ద టిఫిన్, పకోడీ బడ్డీలు తొలగించిన తర్వాత ఖాళీగా ఫుట్‌పాత్

రెండు, మూడు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఇక్కడ ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు లేకుండా చేస్తామని తెలిపారు. పర్యాటక కేంద్రాలకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లను ఇంకెవరూ ఆక్రమించొద్దని హెచ్చరించారు.

మందుబాబులకు జైలు శిక్ష

మర్రిపాలెం : కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి న్యాయస్థానం జైలు శిక్షతోపాటు జరిమానాలు విధించినట్టు ట్రాఫిక్ పోలీసులు మంగళవారం పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 12 మంది పోలీసులకు పట్టుబడ్డారని వెల్లడించారు. వారిలో 9 మందికి రూ.10 వేల నుంచి రూ.20 వేలు చొప్పున మొత్తం రూ.1.05 లక్షలు జరిమానా విధించారు. మరో ముగ్గురు మర్రిపాలెం ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ పి.అప్పలనాయుడు, పీఎంపాలెంకు చెందిన కారు డ్రైవర్ చంద్రకాంత్ పటేల్, శీలానగర్‌కు చెందిన కారు డ్రైవర్ వెంకటేష్‌కు 8 రోజుల చొప్పున జైలు శిక్ష న్యాయమూర్తి విధించినట్టు తెలిపారు.

సరోగసీ దరఖాస్తుల పరిశీలన

మహారాణిపేట: సరోగసీ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయ సమావేశ మందిరంలో సరోగసీ మెడికల్ బోర్డు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరోగసీ తల్లి వివరాలు, ఆరోగ్య పరిస్థితి పూర్తిగా పరిశీలించాలన్నారు. సరోగసీ కోరుకుంటున్న వారి అర్హత పత్రాలు, విధి విధానాలను కమిటీ సభ్యులకు అందజేశారు. కేజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బి.చక్రవర్తి సరోగసీకి ఒకసారి అనుమతించేందుకు అర్హత ఉన్నట్లు నిర్ధారించారు. డాక్టర్ బి.చక్రవర్తి సరోగసీ చేసుకునే వారిని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగ ప్రైవేటీకరణ తగదు

- ప్రభుత్వాల చర్యలపై తీవ్రంగా పోరాడుతాం
- కార్మికుల పోరాటానికి సీఐటీయూ సంఘీభావం



ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : చండీఘర్‌లో విద్యుత్ డిస్కంలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్కడి కార్మికుల చేస్తున్న పోరాటానికి సీఐటీయూ సంఘీభావం తెలియజేస్తుందని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్ తెలిపారు. విద్యుత్ డిస్కమ్‌ల ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని గురుద్వారా వద్ద గల ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలు వేగవంతం చేసిందని ఆరోపించారు. చండీఘర్ రాష్ట్ర డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ 'ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీకి' విక్రయించేందుకు డిసెంబర్ 4న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతంలో లాభాలు గడించే చండీఘర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేటు వారికి అప్పచెప్పడాన్ని సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అక్కడి కార్మికులు చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా డిసెంబర్ 25న చలో చండీఘర్ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు.


ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూడా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని, అందులో భాగంగానే ట్రూ అప్ చార్జీలు పేరుతో వినియోగదారులపై మోయలేని భారం మోపుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రైవేటీకరణ చర్యలను ప్రభుత్వం విరమించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, అదానీతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికుల మద్దతుతో పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, ఎం.సుబ్బారావు, నాయకులు యూఎస్ఎన్ రాజు, పి.వెంకటరావు, జి.అప్పలరాజు, వి.కృష్ణారావు, జి.పోలేశ్వరరావు, కె.కుమారి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో గేట్ నంబర్ 2 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. స్టేషన్ మాస్టర్ సమాచారంతో గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రైల్వే స్టేషన్ గేట్ నంబర్ 2 వద్ద సుమారు 70 సంవత్సరాల వయసు గల వృద్ధుడు మరణించినట్లు స్టేషన్ మాస్టర్ గమనించి, సమాచారం అందించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలూ లేవు. అతని ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసు ఎస్ఐ కె.శాంతారాంను స్వయంగా, లేదా 76739 06010లో సంప్రదించాలని కోరారు.

అమిత్‌షాపై చర్యలకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు

మహారాణిపేట: అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాదరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కించపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతికి విశాఖ జిల్లా కలెక్టర్ ద్వారా విన్నవించుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శులు బోని కృష్ణ, కదిరి రాము, పార్టీ నాయకులు భాగం గోపాలరావు, భీమరశెట్టి విశ్వనాథం, జిల్లా ఇన్‌చార్జి అన్వేష్, ప్రధాన కార్యదర్శి అరుగుల ధనుంజయరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అతుకంశెట్టి రామచంద్రరావు, పెద్దాడ కనకమహాలక్ష్మి, నందికోళ్ల అప్పారావు, అప్పలరాజు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వంగవీటి విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి

ఉత్తరాంధ్ర రాధారంగా కాపు సంఘం ప్రతినిధులు



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న కాపు సంఘం ప్రతినిధులు

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆరిలోవలో వంగవీటి మోహన్ రంగా విగ్రహ ఆవిష్కరణకు అందరూ హాజరై జయప్రదం చేయాలని ఉత్తరాంధ్ర రాధారంగా కాపు సంఘం ప్రతినిధులు కోరారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆరిలోవలో ఉత్తరాంధ్ర రాధారంగా కాపు సంఘం ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వంగవీటి మోహన్‌రంగా 36వ వర్ధంతి సందర్భంగా ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద ఆయన విగ్రహం ఈ నెల 28న ఉదయం 9.30 గంటలకు ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలు, కులాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఇక్కడ విగ్రహం, స్థూపం నిర్మాణం కోసం సంఘంలో కొందరు దాతలు ముందుకొచ్చి సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాత్ర కొండ ధర్మారావు, మోది అప్పారావు, ఏడువాక సన్యాసిరావు, మజ్జి రమణి, మీసాల మురళీమోహన్, ఆబోతు అప్పలనాయుడు, గిరడ మురళి, మధుపాడ సన్యాసిరావు, బండి రాజారమేష్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ప్రకాష్, సన్యాసిరావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

తత్వశాస్త్ర సదస్సు విజయవంతం చేయాలి



వీసీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆచార్యులు

విశాఖ విద్య : జనవరి 24 నుంచి 26 వరకు ఏయూలో జరిగే 17వ అంతర్జాతీయ ఫిలాసఫీ (తత్వశాస్త్ర) సదస్సును విజయవంతం చేసేందుకు కృషి చేయాలని వీసీ జి.శశిభూషణరావు సూచించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య వి.వెంకటరావు ఆధ్వర్యంలో సదస్సు ఆహ్వాన పత్రికలను వీసీకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఇటువంటి సదస్సు వర్సిటీ ఖ్యాతి పెంచేలా నిర్వహించాలన్నారు. సదస్సు నిర్వహణకు అవసరమైన నిధులు సమకూరుస్తామని, ఏ సహకారం కావాలన్నా సంప్రదించాలని నిర్వాహకులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో సదస్సు ప్రాముఖ్యతను చాటాలన్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నర్సింహారావు, ఆచార్య సత్యనారాయణ, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తాం



శిక్షణ అనంతరం విద్యార్థులతో ఐఐపీఈ ఆచార్యులు

ఐఐపీఈ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్

విశాఖ విద్య : విద్యార్థుల అభ్యున్నతికి ఐఐపీఈ ద్వారా తోడ్పాటు అందిస్తామని ఆ సంస్థ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు 'జిజ్ఞాస' పేరిట ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు మంగళవారం తెలిపారు. పాఠశాల పిల్లల్లో సైన్స్, ఉన్నత విద్యపై ఆసక్తి పెంచేలా ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 26 మంది విద్యార్థులు, 19 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని వెల్లడించారు. ఇదే మాదిరి భవిష్యత్‌లోనూ వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, డీన్ విజయ్ కుమార్ కొప్పారపు, ప్రొఫెసర్ అంబటి శేషగిరిరావు, కోర్సు కో - ఆర్డినేటర్లు ఆచార్య అపరాయ్, ఆచార్య రంధి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, స్కూల్ బ్యాగులు, ప్రోత్సాహకంగా రూ.2 వేల చెక్ అందజేశారు. ఉపాధ్యాయులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు.

క్రిస్మస్ సందడి



ఆరిలోవ అంగన్‌వాడీ కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



శ్రీకృష్ణాపురం గురుకులంలో వేషధారణలో విద్యార్థులు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలను విద్యుత్ దీపాలు, పశువుల పాకల సెట్టింగ్‌తో సుందరంగా అలంకరించారు. మరోవైపు విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో మంగళవారం వేడుకలు జరిపారు. శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో ఉపాధ్యాయులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ విద్యార్థులు వివిధ వేషధారణలతో నాటిక ప్రదర్శించి అలరించారు. ఉపాధ్యాయులు క్రిస్మస్ కేకు కట్ చేసి విద్యార్థులకు పంచారు. ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు వివిధ వేషధారణలో అలరించారు.

లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

ఎంవీపీ కాలనీ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ సెక్టార్ - 2లోని ఇమాన్యుయేల్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సమాజంలో మంచిని పెంపొందించేందుకు ఏసు క్రీస్తు జన్మించారని పాస్టర్లు వివరించారు. క్రైస్తవులకు క్రిస్మస్‌తోపాటు నూతన సంవత్సరం ప్రత్యేకమైనదన్నారు. క్రిస్మస్ ను పురస్కరించుకుని ఇమాన్యుయేల్ చర్చిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి ఆరాధనలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.



వేడుకలకు ముస్తాబైన ఇమాన్యుయేల్ లూథరన్ చర్చి